క్లుప్తంగా

బాలకృష్ణ పెద్ద సైకో

– జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న బాలకృష్ణ కంటే పెద్ద సైకో ఎవరూ ఉండరని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం వించిపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్ద సైకో బాలకృష్ణ వ్యవహార శైలి గురించి అందరికీ తెలుసన్నారు. ఆయనకు అంత నోటిదూల ఉంటే తన తండ్రి ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి, కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసిన బావ చంద్రబాబు మీద చూపించుకోవాలే తప్ప ఇతరుల మీద కాదన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని ప్రవర్తించాలని లేని పక్షంలో ఊరుకునేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

కొండ దిగువన కూటమి నేతల ప్రచారం!



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి వెళ్లే దారులను, క్యూలైన్లను సైతం కూటమి నేతలు తమ ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారు. దసరా ఉత్సవాల్లో ఆధ్యాత్మికను దెబ్బతీసేలా కూటమి నేతలు తమ ఇష్టానుసారంగా ఆలయ పరిసరాల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై భక్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.ఆలయానికి చెందిన ఆస్తులపై ఎక్కడా కూడా ఇతర వ్యక్తులకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నిషేధం. అయితే మోడల్ గెస్ట్ హౌస్ ఎదుట, కనకదుర్గనగర్ ఎదుట, కుమ్మరి పాలెం వైపు నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్లపై రాజకీయ నాయకుల ఫోటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్లే దర్శనమిస్తారు. నిత్యం ఇదే మార్గంలో దేవాదాయ శాఖతో పాటు పోలీసు శాఖకు చెందిన అధికారులు, జిల్లా కలెక్టర్ ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా ఈ బ్యానర్లపై దృష్టి పడకపోవడం గమనార్హం. దసరా ఉత్సవాలు మరో ఆరు రోజులు ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు ఈ బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఏదీ ఆ పండుగ శోభ!

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహాలక్ష్మీ అలంకారం రోజున కనీసం అమ్మవారి విగ్రహానికి పూలమాల లేదు.. ప్రధాన ఆలయం చుట్టూ ఉండే అష్టలక్ష్మీదేవిలకు ప్రత్యేక పూల అలంకరణ లేదు.. మొక్కుబడిగా నిత్యం వేసే పూల దండతో సరి పెట్టేశారు.. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలలో పండుగ శోభ కనిపించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా ఉత్సవాలలో అమ్మవారి ఆలయంతో పాటు ఆలయానికి ప్రవేశించే మార్గాల్లో పూలతో విశేషంగా అలంకరించడం ఆనవాయితీ. ఈ ఏడాది దసరా ఉత్సవాలలో పూల అలంకరణకు భారీగానే నిధులు కేటాయింపులు జరిగినా ఆ దిశగా పనులు జరగడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో చేసే అలంకరణకు గతంలో ఎన్నడూ బంతి పూలను వినియోగించింది లేదని, ఈ ఏడాది బంతిపూల మాలను ఎక్కువగా వినియోగించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

కరాటేతో శారీరక, మానసిక ధృడత్వం



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల శారీరక, మానసిక ధృడత్వం సాధిస్తారని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ జె. సంధ్య మాధురి అన్నారు. శాంతినగర్‌లో క్యోకు కరాటే అకాడమీ ఆధర్వ్యంలో ట్రైనింగ్ క్యాప్ అండ్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.
ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ సంధ్య మాధురి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులు మున్ముందు జరిగే కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. మానస ఇంగ్లీషు మీడియం ప్రిన్సిపాల్ పల్లెం జయప్రకాష్, హైదరాబాద్‌కు చెందిన విజన్ మార్షల్, అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎం.విఠల్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకిలాద్రిలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దసరా మహోత్సవాలలో శుక్రవారం రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి మహాలక్ష్మీ దేవి అలంకారంలోని దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆమకు స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వాచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాదుర్గమ్మను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు క్షేమంగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యంగా ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిడిపించడానికి అమ్మవారు శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు.



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణి



ఘాట్ వద్ద భక్తులు

అంగరంగ వైభవంగా
దసరా మహోత్సవాలు

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేలాది మంది భక్తులు రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అర్చకులు నిర్వహిస్తున్న కుంకుమ పూజల్లో దంపతులు పాల్గొంటున్నారు. కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కనులపండువగా సాగింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



అమ్మవారి ఊరేగింపు



కుంకుమ పూజలో దంపతులు

ఐశ్వర్య ప్రదాయినీ.. మహాలక్ష్మీ నమోస్తుతే..

భవానీపురం(విజయవాడపశ్చిమ): సకల లోకాలకు ఐశ్వర్య ప్రదాయిని శ్రీమహాలక్ష్మీ నమోస్తుతే అంటూ భక్తులు కై మోడ్పులు సమర్పించుకున్నారు. భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్‌లోగల శ్రీ గంగా – దుర్గా – మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవిగా దర్శనం ఇచ్చారు. దేవీ ఉపాసకురాలు తమ్మిన రవీన ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పాల్గొన్నారు. ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో పోలేరమ్మ శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. దేవస్థానం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సూరసాని రామిరెడ్డి, జీ విజయబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కాత్యాయనీదేవిగా మహాలక్ష్మీదేవి..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో భాగంగా చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారు కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ సుజన్, నగరాల ప్రముఖులు బాయన వెంకట్రావు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కళ్యాణ మండపంలో అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పూజలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలువురు కళాకారులు తమ నాట్యప్రతిభను ప్రదర్శించారు. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, మజ్జి ఈశ్వరరావు, పోతిన వెంకట ధర్మారావు, పిళ్లా విజయ్‌కుమార్, తమ్మిన సూర్యకుమారి, తొత్తడి భరత్‌కుమార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భవానీపురం కోళ్లఫారం రోడ్డులోని ఉత్సవాల్లో అమ్మవారు

విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజలు నిర్వహించారు. పాలప్రాజెక్టు సమీపంలోని గంగానమ్మ వారి దేవస్థానంలో దుర్గా గాయత్రి అర్చక యాగ్నిక సేవా సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉభయదాతలచే మహాలక్ష్మీ హోమం నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ బసవ కాశీ విశ్వనాథ్, సుంకర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. కుంచెం శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి వెంకట దుర్గ శివనాగేంద్ర, వై.వెంకటేశ్వర్లు తదితరులు ఉత్సవాలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే....

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల పెద్ద సంఖ్యలో గంగనమ్మ మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక అర్చనల తరువాత భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న అమ్మవారు కాత్యాయినిదేవిగా దర్శనమిచ్చారు. వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన పద్మావతి అమ్మవారు గజలక్ష్మీ దేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు దీక్షిత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణ ప్రార్థనామందిరంలో కొలువై ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. దర్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న పార్వతీదేవి మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు మురళీ పర్యవేక్షించారు. కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉన్న దాసాంజనేయస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ద్విశత చండీయాగ మహోత్సవంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు పర్యవేక్షించారు.



కొత్త అమ్మవారి సన్నిధిలో సాంస్కృతిక ప్రదర్శన



విజయదుర్గా అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు



శ్రీమహాలక్ష్మీదేవిగా గంగానమ్మ వారు



కాత్యాయనీదేవిగా మహాలక్ష్మీదేవి



శ్రీమహాలక్ష్మీదేవిగా విజయ దుర్గా అమ్మవారు



పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు



విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు



మహాలక్ష్మీదేవిగా చదును మహాలక్ష్మీ అమ్మవారు



మహాలక్ష్మీగా గంగానమ్మ అమ్మవారు



శ్రీ కాత్యాయినిదేవిగా భ్రమరాంబ అమ్మవారు



శ్రీ గజలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు

సభ గౌరవ, మర్యాదలను మంటగల్పిన బాలకృష్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిండు అసెంబ్లీలో సభ గౌరవ, మర్యాదలను మంటగల్పిన ఎమ్మెల్యే బాలకృష్ణను అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయాలని వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బెవర నాగేశ్వరరావు ఒక ప్రకటనలో స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత జీవితంలోనూ నియంత్రణ లేకుండా ప్రవర్తించే ఆయన అసెంబ్లీలో సైతం మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని తెలిపారు. సభలో అన్న చిరంజీవిని అసభ్య పదజాలంతో దూషిస్తే ఒక సోదరుడిగా, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ప్రజల సమక్షంలో అభిమానులపై చేయి చేసుకోవడం, సినిమా షూటింగ్‌ల్లో సెట్స్‌పై ప్రవర్తించినట్లు దేవాలయం వంటి అసెంబ్లీలోనూ వ్యవహరిస్తే స్పీకర్‌తో సహా శాసనసభ్యులు ఎవరూ నోరెత్తకపోవడం బాలకృష్ణ అధికార పార్టీ సభ్యుడు కావడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నైతిక విలువలు లేని బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలపై ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ఆయన తక్షణమే మెగా స్టార్ చిరంజీవికి, వైఎస్ జగన్‌కు బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

డ్రైయిన్‌పై ఆక్రమణల తొలగింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని పుల్లేటి కాలువ డ్రెయిన్ విస్తరణ పనుల్లో భాగంగా డ్రెయిన్‌పై ఉన్న ఆక్రమణలను నగర పాలక సంస్థ అధికారులు శుక్రవారం సాయంత్రం తొలగించారు. ఈ సందర్భంగా అర్హులైనవారికి అజిత్‌సింగ్‌నగర్‌లోగల జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద నిర్మించిన ఇళ్లను కేటాయించగా, పాక్షికంగా ప్రభావితమైనవారికి పునరావాసం కల్పించినట్లు అధికారులు తెలిపారు. డ్రెయిన్ నిర్మాణ పనులు సాఫీగా కొనసాగేందుకు ప్రజలు సహకరించాలని కోరుతూ ఏసీపీ మోహన్‌బాబు, టీపీఓ వసీం బేగ్ స్థానిక నాయకులు, ప్రజలను చైతన్యవంతం చేశారు. డ్రెయిన్ పూర్తి అయిన తరువాత వర్షాకాలంలో నీటి నిల్వలు తగ్గి కాలనీల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

పీఎస్‌సీఎంఆర్ కాలేజ్‌లో సందడిగా దసరా వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఆయుధపూజలను నిర్వహించారు. అలాగే నవదుర్గ నృత్య రూపకాన్ని విద్యార్థినులు చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అదేవిధంగా బతుకమ్మ పూజలను నిర్వహించి ఆడిపాడారు. వారితో పాటుగా దండియా నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ పర్వదినాలను తెలుసుకోవాలన్నారు. కళాశాల సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న రౌండ్‌టేబుల్ సమావేశం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్య సంరక్షణా వ్యవస్థ కొనసాగించాలని కోరుతూ ప్రజా ఆరోగ్య వేదిక, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 28న రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.లక్ష్మణరావు, ప్రజా ఆరోగ్య వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.విజయప్రకాష్ తెలిపారు.

నగరంలో రోడ్లను గుంతల రహితంగా మార్చాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని గుంతల రహిత రోడ్లుగా మార్చాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం గురునానక్ కాలనీ, ఎస్ఏసీ కల్యాణ మండపం, రమేష్ హాస్పిటల్ సిగ్నల్స్, బెంజ్ సర్కిల్, వెటర్నరీ హాస్పిటల్, ఎంజీ రోడ్డు, కృష్ణలంక, వినాయకుని గుడి, కృష్ణవేణి ఘాట్, కేశఖండనశాల, హోల్డింగ్ ఏరియా, కెనాల్ రోడ్, క్యూ లైన్ ప్రాంతాల్లో పర్యటించారు. రమేష్ హాస్పిటల్ సిగ్నల్ నుంచి గురునానక్ కాలనీ వెళ్లే రోడ్డుని పరిశీలించారు. అక్కడ గుంతలు పెద్దగా ఉన్నాయని గమనించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, నగరంలో రోడ్లన్నీ గుంతల రహిత రోడ్లులుగా ఉంచాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లలో ఎక్కడా గుంతలు ఉండకూడదని ఆదేశించారు. రోడ్డుపైన వర్షపు నీటి నిల్వలు ఎక్కడ ఉండకూడదన్నారు. నగరంలోని మ్యాన్ హోల్స్ అన్నీ రోడ్ల లెవల్లోనే ఉండాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు దసరాశరన్నవరాత్రుల వేడుకలలో భాగంగా వీఎంసీ కల్పిస్తున్న సౌకర్యాలపై ఆయన భక్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అందరికీ తాగునీరు అందుతుందా లేదా, ఉచితంగా చెప్పులు సామాన్లు భద్రపరచు ప్రదేశం, మరుగుదొడ్డి నిర్వాహణపై భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

విద్యార్థుల విజయమే తల్లిదండ్రులకు గొప్ప బహుమతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మంచి స్థానానికి చేరుకొని గొప్ప విజయాలను సాధించటమే వారి తల్లిదండ్రులకు అందించే గొప్ప బహుమతి అని సినీ, బుల్లితెర నటుడు సుడిగాలి సుధీర్ అన్నారు. కేబీఎన్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆ కళాశాల ఆవరణలో శుక్రవారం సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆకళాశాల పూర్వ విద్యార్థి సుడిగాలి సుధీర్, జబర్దస్త్ బృందం రాంప్రసాద్, భాస్కర్, నరేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సుడిగాలి సుధీర్ మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ఇదే కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుకున్నాని చెప్పారు. తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. జబర్దస్త్ టీం బుల్లెట్ భాస్కర్, ఆటో రాంప్రసాద్, నరేష్ స్కిట్స్ ప్రదర్శించి, స్టూడెంట్స్‌ని ఉత్సాహపరిచారు. కళాశాల కార్యదర్శి టీ శ్రీనివాసు, ఏవో డాక్టర్ వి. నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుడిగాలి సుధీర్

● **లబ్బీపేట (విజయవాడ తూర్పు):** వైద్య విద్యలో మానవత్వాన్ని మర్చిపోవద్దని, నిష్టగా చదవాలి, రోగులకు దయతో సేవలు అందించాలని ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. మొదటి ఏడాది ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. డాక్టర్ చిత్ర, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ చౌదేశ్వరి, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

● చిన్నారులపై చిన్నచూపేల ?





సాంస్కృతిక కళావేదిక వద్ద ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించాలి. గతంలో వీరందరికీ మహామండపం లిఫ్ట్ గుండా ప్రవేశం ఉండేది. కానీ ఈ సారి ఈ మార్గం కాకుండా వీరిని ఘాట్‌రోడ్ ద్వారానే కొండపైకి వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకోవాలనే ఆంక్షలతో అవస్థలు ఎదుర్కొన్నారు. కొండపైకి వెళ్లేందుకు ఎటువంటి వాహన సదుపాయం లేకపోవడంతో పాటు అడుగడుగునా పోలీసుల ఆంక్షలతో నరకయాతన అనుభవించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎంతో మంది చిన్నారి కళాకారులు అమ్మవారి దర్శనం చేసుకోకుండానే నిరాశతో వెనుతిరిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ